భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 23 : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పీయూ అధ్యక్ష, కార్యదర్శులు రాము, రాజేశ్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలన నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం సాగుతున్న మహోద్యమంలో 1919లో జరిగిన జలియన్ వాలా బాగ్ ఘటనలో 12 ఏండ్ల ప్రాయంలోనే తన ఇద్దరు మిత్రులతో కలిసి స్వతంత్ర్య ఉద్యమం పోరాటంలో భగత్‌సింగ్ పాల్గొన్నాడ్నారు. బ్రిటిషర్లపై తిరుగుబాటులో 23ఏళ్ల ప్రాయంలోనే ఉరికంబాన్ని ముద్దాడిన నిజమైన దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ, గణేశ్, కమలాకర్, రాజు, శివ, పూజిత, శ్రీలత, సంగీత, రాజేశ్వరి, కిరణ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, మార్చి 23 : యువత భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం పోరాటం చేయాలని పీవైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకొని పీడీఎస్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పాతబస్టాండ్ మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ అభిప్రాయాలను లెక్కచేయకుండా నూతన విద్యా విధానం అమలు చేయడం కోసం స్కిల్ ఇండియా పేరుతో బలవంతంగా ఆమోదించుకొని ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. యూనివర్సిటీల్లో నూతన ముసాయిదా తీసుకువచ్చి పరిశోధక విద్యార్థులు, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేస్తున్నదన్నారు. బీజేపీ అనుసరించే విధానాలపై నేటి విద్యార్థి యువకులు భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రాం విఠిడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బాల్‌రాం, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, పీడీఎస్యూ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మారుతి, సహాయ కార్యదర్శి వెంకటేశ్, పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : పీడీఎస్యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, మార్చి 23 : మండలంలోని బిజ్వారంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పీవైఎల్, పీడీఎస్యూ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి సలీమ్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, నాయకులు ఎల్లప్ప, తిమ్మప్ప, గోవర్ధన్‌రెడ్డి, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూరులో..

మాగనూర్, మార్చి 23 : మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఊట్కూర్ : భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మాగనూర్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, మార్చి 23 : పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఆగిరి సహదేవ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో సిటీ న్యూరో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బాలస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇచ్చే విలువైన ఆస్తి విద్య

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 23 : పిల్లలకు మనం ఇచ్చే విలువైన ఆస్తి విద్య ఒక్కటేనని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పాలమూరు రెడ్డి సేవా సమితి 23వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెడ్డి సేవా సమితి సేవలను కొనియాడారు. గ్రామాల్లో ఉండే పిల్లలందరికీ విద్యను అందించేందుకు కమ్యూనిటీ లీడర్స్‌గా ఉండాలని సూచించారు. మనకు గౌరవ ప్రతిష్టలు పెరగాలంటే ఒక అడుగు ముందు పేద వర్గాలకు చేయూతనిచ్చి సహకరించాలన్నారు. చదువుకు నోచుకోని పేద విద్యార్థుల కోసం మహబూబ్‌నగర్ విద్యానిధి ఏర్పాటు చేశామని, చేయూత ఇవ్వాలని కోరారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, పాలమూరు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, చిన్నారెడ్డి, అనంతరెడ్డి, రామిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎల్ఈడీ స్క్రీన్

మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్, ముడా నిధులతో ఎల్ఈడీ స్క్రీన్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు స్క్రీన్లు ఉపయోగపడతాయన్నారు.

రైతులను ఆదుకుంటాం..

పాలమూరు, మార్చి 23 : రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి వడగండ్ల వర్షానికి నష్టపోయిన బొక్కలోనిపల్లి గ్రామ రైతులను పరామర్శించారు. చౌదర్‌పల్లి, బొక్కలోనిపల్లి, జమిస్తాపూర్, రాంచంద్ర పూల్, జమిస్తాపూర్ గ్రామాల్లో 1,520 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు. పూర్తి స్థాయిలో నివేదికను ఇవ్వాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇండ్లు

మూసాపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే మధు సూదన్ రెడ్డి

మూసాపేట, మార్చి 23 : అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేటలో ఆదివారం ఎమ్మెల్యే రూ.4 కోట్ల 70ల క్షతో 94డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సర్కారు పనిచేస్తుందన్నారు. అర్హులందరికీ పథకాలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శేఖర్, కృష్ణయ్య, జగదీశ్వర్‌తో తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మద్దూర్ (కొత్తపల్లి) మార్చి 23 : గడ్డి మందు తాగి యువకుడు మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్‌కు చెందిన కావలి సాయికుమార్ (22) ను తండ్రి రాములు మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 17వ తేదీన వ్యవసాయ పొలంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

నిబంధనలు పాటించకపోతే చర్యలు

నారాయణపేట, మార్చి 23 : వాహన దారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఏఎస్సై ఆంజనేయులు సూచించారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించి ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయరాదని, ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

వేరుశనగ ధర రూ.6,460

నవాబ్‌పేట, మార్చి 23 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,460 ధర లభించినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన రైతులు 1,716 బస్తాల వేరుశగ ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చినట్లు వివరించారు. గరిష్ఠంగా రూ.6,460, కనిష్ఠంగా రూ.5,501 ధర పలికినట్లు తెలిపారు. చింతపండు 450 బస్తాలు రాగా, గరిష్ఠంగా రూ.15,601, రాగులకు గరిష్ఠంగా 2,712 ధర లభించినట్లు ఆయన పేర్కొన్నారు.

డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట, మార్చి 23 : పట్టణంలో ఆదివారం డీవైఎఫ్ఐ(భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షులుగా అరుణ్, భరత్, సహాయ కార్యదర్శులుగా హన్మంతు, మల్లేశ్, సభ్యులుగా కనకప్ప, వివేక్, సాంబ, అంజి, హృదయ్ తదితరులను ఎన్నుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, మార్చి 23 : జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు టూ టౌన్ సీఐ ఎజాజ్ జుద్దీన్ తెలిపారు. ఈనెల 21వ తేదీన శుక్రవారం పట్టణంలోని అమృత హాస్పిటల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాన్ని టూటౌన్ పోలీసు వారు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కాగా, మృతుడి వద్ద అతడి కుమారుడు శివ(6) ఉండడంతో బాబును వివరాలు అడుగగా వీరన్న పేటగా చెప్పినట్లు పేర్కొన్నారు. బాలుడిని స్టేట్ హోంకు తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659312, 8712659335 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉగాది సాహితీ పురస్కారాలు అందజేత

పాలమూరు, మార్చి 23 : తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పాలమూరు, ప్రమీల శక్తి పీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలకు ఉగాది పురస్కారాలను అందజేశారు. స్వామియే విశ్వ విద్యాలయం శాఖ పూర్వాధ్యక్షుడు ఆచారి మానస చెన్నప్ప హాజరై పద్యకవి బాలస్వామి రచించిన నమో శిల్పిపుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి, సంస్థ అధ్యక్షురాలు వనజ, కవులు పొద్దుటూరి ఎల్లా డ్డి, లక్ష్మణ్‌గౌడ్, మాడ పుష్పలత, దేవ దాసం, రాజ గోపా లచారి, జనార్ధన, ఖాజా మైనొద్దీన్, యాదయ్య, వనజ, జమున, పద్మావతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలను అందుకున్న మహిళలు, సాహితీ వేత్తలు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన

మక్తల్, మార్చి 23 : ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేపట్టడం జరిగిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్ బీమా పంప్‌హౌస్ స్టేజ్-2 వద్ద స్థలాన్ని పరిశీలించి, మక్తల్ మండలం గొల్లపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపిక చేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట తాసీల్దార్ సతీశ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కేసీఆర్ హయాంలోనే మైనార్టీల అభ్యున్నతి

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య

జడ్చర్ల టౌన్, మార్చి 23 : కేసీఆర్ హయాంలోనే మైనార్టీలు అన్ని విధాల అభ్యున్నతి చెందారని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ఆదివారం జడ్చర్లలోని మాజీ జెడ్పీవైస్ చైర్మన్ స్వగృహంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరూ సంఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రణీల్ చుదర్, శ్రీకాంత్, కరాటే శ్రీను, హపీజ్, ఇర్ఫాన్, హబీబ్, ఇంతియాజ్ బాలు, జావిద్, దానిశ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, ముస్లింలు

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 23 : ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 47వ జాతీయస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు మాధురి, శ్రీవర్ధిని, పారిజాత తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, సెక్రెటరీ జీయా వొద్దీన్, బాల్‌రాజ్, అహ్మద్, కోచ్ ప్రదీప్, ప్రణయ్‌కుమార్ అభినందించారు.

అపూర్వ సమ్మేళనం

జడ్చర్లలోని నాగార్జున హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. – జడ్చర్ల టౌన్

రేపు ఎంవీఎస్‌లో మెగా జాబ్ మేళా

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 23 : మహబూబ్‌నగర్ సమీపంలోని క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు రెజ్యూమ్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు, విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.25వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఎంవీఎస్ కళాశాల, మ్యూజిక్‌బస్ సంయుక్తంగా నిర్వహించే ఈ మేళాను ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ రంగ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ప్రొబేషనరీ ఆఫీసర్స్, బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటీవ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెచ్ఆర్ ఇంటర్న్‌షిప్, ఇంటర్నల్ సేఫల్ వాయిస్ ఆఫీసర్లుగా పోస్టులు కేటాయిస్తారన్నారు, ఫార్మా రంగంలో సత్యదివిస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కెసిస్ట్, ఆపరేటర్లుగా, హెల్పర్లుగా తీసుకుంటారని పేర్కొన్నారు.

నేడు చలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 23 : తెలంగాణ హెల్త్ కమ్యూనిటీ వర్కర్స్, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన విధంగా హెల్త్ కమ్యూనిటీ వర్కర్లకు, ఆశ కార్యకర్తలకు నెలకు రూ.18వేల జీతం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివీ, పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన కార్యక్రమానికి హెల్త్‌వర్కర్లు, ఆశ కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

యాంత్రీకరణల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఊట్కూర్, మార్చి 23 : మహిళా రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై యాంత్రీకరణలను అందజేస్తుందని ఏవో గణేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ 2024-25 పథకం కింద మహిళా రైతులకు వివిధ రకాల వ్యవసాయ పరికరాలు అందించేందుకు మండలానికి 5 రోటావేటర్స్, 12 తైవాన్ స్ప్రేయర్లు, 13 మ్యానువల్ స్ప్రేయర్స్, సీడ్ డ్రిల్, ట్రాక్టర్ తదితర యంత్రాలు మంజూరైనట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

నారాయణపేట, మార్చి 23 : వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ ఆదివాసి ఎరుకలి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహా, ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ చిన్నపిల్లల దవాఖాన వద్ద తెలంగాణ ఆదివాసి ఎరుకలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారభించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాములు, రామకృష్ణ, అశోక్, కాశప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అమిస్తాపూర్‌లో వైద్య శిబిరం

భూత్పూర్, మార్చి 23 : పట్టణంలోని అమిస్తాపుల్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం దయానంద విద్యా మందిర్ పాఠశాలలో కందూరు రాంరెడ్డి కంటి దవాఖాన వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ నేత బాబా ఆప్టే స్మారకార్థం వైద్య శిబిరం నిర్వహించినట్లు జిల్లా ప్రముఖ్ వెంకటేశ్ తెలిపారు. 210మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 59మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమున్నట్లు వైద్యులు గుర్తించారు.

గ్రామాల్లో ఐపీఎల్ మానియా

నవాబ్‌పేట, మార్చి 23 : గ్రామాలకు క్రికెట్ ఐపీఎల్ మానియా పట్టుకున్నది. క్రికెట్ మ్యాచ్‌లను చూసేందుకు అన్నివర్గాల వారు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల ప్రారంభమైన మ్యాచ్‌ల కోసం యువకులు, అభిమానులు కొన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసుకొని మ్యాచ్‌లను తిలకిస్తున్నారు. కొల్లూరు గేట్ వద్ద టీ స్టాల్‌లో శివనాయక్ అభిమానులు మ్యాచ్ చూసేందుకు ఎల్ఈడీ ఏర్పాటు చేశాడు. కొన్ని గ్రామాల్లో బెట్టింగ్ కూడా ప్రారంభించినట్లు తెలుస్తున్నది.